సాక్షి ఒడిశా
బుధవారం । 30 । అక్టోబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.6,11,295
బంగారం	850 మిల్లీ గ్రాములు
వెండి	9 గ్రాముల 900 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



ఓటుహక్కుపై అవగాహన

రాష్ట్రవ్యాప్తంగా ఓటుహక్కుపై అవగాహన కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు.

- 8లో



యోగా పరిశోధన కేంద్రం శంకుస్థాపన

రాష్ట్రంలో యోగా, ప్రకృతి వైద్యం కేంద్ర పరిశోధన సంస్థ త్వరలో ఏర్పాటు కానుంది.

- 8లో

న్యూస్‌రీల్

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన శౌశ్యా రెడ్డి

జయపురం: సబ్ కలెక్టర్ అక్కవరం శౌశ్యా రెడ్డి సోమవారం సాయంత్రం జయపురం మున్సిపల్ కార్య నిర్వాహక అధికారిగా అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు కార్య నిర్వాహక అధికారిగా పనిచేసిన సిద్ధార్థ పట్నాయిక్ బదిలీ కావడంతో శౌశ్యా రెడ్డి అదనపు బాధ్యతలు తీసుకున్నారు. ఆమెకు సిబ్బంది అభినందనలు తెలిపారు.

ట్రక్కు, టిప్పర్ ఢీ



ప్రమాదంలో చిక్కుకున్న ట్రక్కు, టిప్పర్‌లు

జయపురం: జయపురం – కొరాపుట్ 26వ జాతీయ రహదారి ఘాట్ రోడ్డులో మంగళవారం ఒక ట్రక్కు, ఒక టిప్పర్ ఢీకొన్నాయి. ప్రమాదంలో ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బరిణిపుట్ పోలీసు పంటి పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకొని రహదారి క్లియర్ చేసేందుకు చర్యలు చేపట్టారు.

నదిలో పడిన బైక్

- ఒకరు మృతి



వంతెన నుంచి నదిలోకి పడిన బైక్

భువనేశ్వర్: వంతెన నుంచి నదిలోకి బైక్ జారింది. ఈ దుర్ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందాడు. మరో వ్యక్తి గాయపడ్డాడు. బాలాసోర్ జిల్లా సొరొ ఠాణా నదీగాంవ్ పంచాయతీ పిత్తాకలియా గ్రామం సమీపంలో మంగళవారం ఉదయం ఈ విషాదం చోటు చేసుకుంది. మృతుడు రబీంద్ర సాహుగా గుర్తించారు. గాయపడిన వ్యక్తి రబీంద్ర మండల్. వీరివురు నదీగాంవ్ పంచాయతీ కాన్‌పూర్ గ్రామస్తులు. తుడిగొడియా బజారు నుంచి స్వగ్రామం కాన్‌పూర్‌కు బైక్ మీద వస్తుండగా దుర్ఘటనపాలయ్యారు. పిత్తాకలియా ప్రాంతంలో రహదారి అస్తవ్యస్తంగా ఉండడంతో బైక్ అదుపు తప్పి నదిలోకి పడింది. ఘటనా స్థలంలో రబీంద్ర సాహు మృతి చెందాడు. గాయపడిన రబీంద్ర మండల్‌కు సొరొ ఆస్పత్రిలో చేర్చి ప్రాథమిక చికిత్స చేయించి ఉన్నత చికిత్స కోసం బాలాసోర్ జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించారు.


స్వల్ప ఉద్రిక్తత

ఈ ప్రాంతంలో రహదారుల నిర్వహణ దిగజారింది. ప్రస్తుతం మొక్కుబడిగా పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులు అస్తవ్యస్తంగా నిర్వహించడంతో సాధారణ రాకపోకలకు వీలు లేని పరిస్థితుల్లో ఈరోజు విషాద సంఘటన చోటు చేసుకుందని గ్రామస్తుల ఆరోపణ. ఈ ఆరోపణతో గ్రామస్తులు ఆందోళనకు దిగారు. దీంతో ఈ మార్గంలో రవాణాకు అంతరాయం ఏర్పడింది.

కేరళలో వలస కార్మికుడి మృతి

రాయగడ: కేరళలో వలస కార్మికుడు మృతి చెందాడు. మృతుడు జిల్లాలోని కొలనార సమితి పరిధి పాణిఛత్ర గ్రామానికి చెందిన రుబేన్ మండంగి (21)గా గుర్తించారు. నాలుగు నెలల క్రితం ఉపాధి కోసం స్నేహితులతో కలిసి కేరళలోని తిరుచూర్ జిల్లా, సెంట్రీథామస్ అనే ప్రాంతంలోని ఒక హోటల్లో పని చేసేందుకు వెళ్లాడు. అక్కడ వారం రోజుల క్రితం అస్వస్థతకు గురయ్యాడు. పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో హోటల్ యజమాని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మండంగి సోమవారం మృతి చెందినట్లు హోటల్ యజమాని కుటుంబీకులకు సమాచారం అందించాడు. దీంతో అక్కడికి చేరుకున్న మండంగి కుటుంబీకులు మృతదేహాన్ని తమ స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కార్మిక శాఖ అధికారికి కోరారు. స్పందించిన కార్మిక శాఖ అధికారులు అందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రోజురోజుకూ ఉపాధి వెతుక్కుంటూ వెళ్లి తిరిగి శవాలుగా వస్తున్న యువకుల సంఖ్య పెరుగుతుండడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

ఆర్థిక సంవత్సరం	వ్యయ ప్రణాళిక (రూ.కోట్లలో)
2024 - 25	41.75
2025 - 26	47.15
2026 - 27	43.75
2027 - 28	36.50
2&28 - 29	30.85
మొత్తం	200.00



వరదలకు అడ్డుకట్ట..!

- పురాతన ఆనకట్టల సంరక్షణకు చర్యలు
- 5 ఏళ్ల కార్యాచరణకు శ్రీకారం
- నిధులు వెచ్చించనున్న రాష్ట్ర ప్రభుత్వం

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేసేందుకు చురుకుగా పని చేస్తోంది. దీనిలో భాగంగా రాష్ట్ర జల వనరుల విభాగం ఆధ్వర్యంలో అవాంఛనీయ వరదల కట్టడికి నడుం బిగించింది. మొత్తం 5 ఏళ్ల కార్యాచరణ యోచనతో సరికొత్త కార్యక్రమాన్ని సంకల్పించింది. ఆనకట్టల సంరక్షణ, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనుంది. ఎక్కువగా పురాతన, దిగజారిన ఆనకట్టలు పట్టుకోల్పోవడంతో లోతట్టు ప్రాంతాల్లో అవాంఛనీయ వరద పరిస్థితులు తలెత్తుతున్నాయి. దీంతో అపార పంట నష్టంతో పాటు ప్రాణహాని, పాడి సంపద కొట్టుకుపోవడం, తోటలు ఇతరేతర పర్యావరణ పరిసరాలు నీట మునగడం వంటి వైపరీత్యాలు తరచూ తాండవిస్తున్నాయి. ఈ పరిస్థితి నివారించేందుకు రాష్ట్రంలో మోహన్ చరణ్ మాఝి సర్కారు ఎన్నికల హామీల వాస్తవ కార్యాచరణలో భాగంగా ఆనకట్టల సంరక్షణ, అభివృద్ధి కార్యక్రమం చేపట్టేందుకు రంగం సిద్ధం చేసింది. రాష్ట్రంలో జలాశయాల నిర్వహణ వ్యవస్థ నియంత్రణకు ఈ కార్యక్రమం దోహదపడి వరద నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తుంది. రానున్న 5 ఏళ్లలో రాష్ట్రంలోని పురాతన ఆనకట్టల పునరుద్ధరణ చేపడతారు.

పంచవర్ష ప్రణాళిక

రాష్ట్ర ప్రభుత్వం మొత్తం ఐదేళ్ల ప్రణాళికతో కార్యక్రమం చేపట్టింది. దీని కోసం స్వీయ వనరుల నుంచి రాష్ట్ర ప్రభుత్వం రూ.200 కోట్లు వెచ్చిస్తోంది. పురాతన, జీర్ణావస్థకు దిగజారిన ఆనకట్టలు, వరద కట్టడి వ్యవస్థ డీలా పడిన పరిస్థితులు వరద ఉధృతికి ఊతం ఇస్తున్నాయి. ఈ పరిస్థితి నివారించేందుకు జల వనరుల విభాగం వీటి సంరక్షణ పరిష్కార సోపానంగా ఖరారు చేసింది. మరోవైపు నిర్వహణ వ్యవస్థని పటిష్టపరచి ఆనకట్టల జీవన కాలం సుదీర్ఘపరిచే యోచనతో వ్యూహాత్మక కార్యాచరణతో జల వనరుల విభాగం కొత్త కార్యక్రమం రూపురేఖలు దిద్దుతుంది. అంచెలంచెలుగా రూ.200 కోట్లు చెల్లించి 5 ఏళ్లపాటు దీర్ఘకాల ప్రణాళిక అమలు కోసం సన్నాహాలు తుది దశకు చేరుకున్నట్లు సమాచారం. ఆనకట్ట సరంక్షణ, అభివృద్ధి కార్యక్రమం కింద ఆనకట్టల పట్టు దీర్ఘ కాలం కొనసాగేలా కార్యాచరణ అమలు అవుతుందని జల వనరుల విభాగం సమాచారం. ఈ కార్యాచరణ కోసం అదనపు మానవ వనరుల అవసరం ఉండదు. ఆనకట్టల సంరక్షణ, ఆరోగ్యవంతమైన జలాశయం, దీర్ఘకాల జీవన కాలం, నీటిమట్టం అభివృద్ధి, అవసరాలకు అనుగుణంగా నీటి పంపిణీ కొత్త కార్యక్రమం లక్ష్యంగా చేపడుతున్నారు.

రూ.200 కోట్లతో ప్రణాళిక

జలాశయాల పటిష్టత కోసం రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిన ఆనకట్టల సరంక్షణ, అభివృద్ధి కార్యక్రమం కోసం సమగ్రంగా రూ.200 కోట్లు వెచ్చిస్తారు. ఈ మొత్తం 5 ఏళ్లు వెచ్చించి కార్యక్రమం అమలు నిరవధికంగా కొనసాగిస్తారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఆర్థిక సంవత్సరం నుంచి ఈ మొత్తం అంచెలంచెలుగా ఏటా విడుదల చేస్తారు.

అనుమతుల్లేని దుకాణాలపై ఆగ్రహం



బాణసంచా దుకాణాలను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ స్వయి

- బాణసంచా దుకాణాల్లో తనిఖీలు



బాణసంచా దుకాణాల వద్ద కొనుగోలుదారుల సందడి



అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన దుకాణాలు

రాయగడ: స్థానిక రైతుల కాలనీ శివారులో ఎటువంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలపై తహసీల్దార్ ప్రియదర్శిని స్వయి ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ యంత్రాంగం ప్రతీ ఏడాది బాణసంచా దుకాణాలకు అనుమతులు ఇస్తుంది. ఈ నేపథ్యంలో పట్టణ శివారులో దుకాణాల ఏర్పాటుకు రైతుల కాలనీ శివారులో స్థలం కేటాయించింది. అయితే మంగళవారం సాయంత్రం నాటికి ఎటువంటి అనుమతులు ఇవ్వకపోయినా యథేచ్ఛగా విక్రయాలు సాగిస్తుండడంతో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. అనుమతి పత్రాలు లేకుండా ఎలా విక్రయిస్తున్నారని దుకాణదారులను ప్రశ్నించారు. అనుమతులు ఇచ్చేంతవరకు దుకాణాలు మూసివేయాలని ఆదేశించారు. లేకుంటే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

నేడు బొనొకొ లగ్గి

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథుని శ్రీముఖ సింగారం బుధవారం నిర్వహించనున్నారు. ద్వితీయ భోగ మండపం తర్వాత ఈ సేవ ప్రారంభిస్తారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు బొనొకొ లగ్గి నిర్వహిస్తారు. ఈ వ్యవధిలో సాధారణ భక్తులకు సర్వ దర్శనం నిలిపి వేస్తారు. ఈ లెక్కన సుమారు 5 గంటలపాటు భక్తులు, యాత్రికులకు దర్శనం లభించదని శ్రీమందిరం దేవస్థానం అధికార వర్గాలు తెలిపాయి.

కాళీపూజకు సన్నాహాలు పూర్తి



కాళీ ఉత్సవాలకు సిద్ధమైన భారీ పెండాల్

రాయగడ: స్థానిక బ్లాక్ కాలనీ సమీపంలోని కాళీ మందిరం వద్ద కాళీపూజ ఉత్సవాలకు రంగం సిద్ధమయ్యింది. ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 41 ఏళ్లుగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్ నేతృత్వంలో ఈ ఉత్సవాలు ప్రతీ ఏడాది అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా ఈ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని పట్నాయక్ తెలిపారు. ఈనెల 31వ తేదీ అర్ధరాత్రి నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలు పదో తేదీ వరకు కొనసాగుతాయి. పదకొండు రోజుల పాటుగా జరిగే ఈ కాళీపూజ ఉత్సవాల్లో భాగంగా గురుతార, త్రిపుర సుందరి, భువనేశ్వరి, త్రిపుర భైరవి, చిన్నమస్కా, ధూమావతి, బగలాముఖి, కమలాత్మిక రూపాల్లో కాళీమాతను పూజిస్తారు. చివరి రోజు బాల్యకుమారి పూజలతో ఉత్సవాలు ముగుస్తాయి. కాళీమాత ఉత్సవాలను తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో హాజరవుతారు. వారి సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేపడుతున్నారు. ముఖ్యంగా శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రత్యేకంగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. వివిధ స్టాల్‌ను ఏర్పాటు చేస్తున్నారు.


చోరీ కేసు ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జితేంద్రనాథ్ పండా



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు



స్వాధీనం చేసుకున్న వెండి ఆభరణాలు

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహనా పోలీసుస్టేషన్ పరిధిలో గత నెల 29వ తేదీన ఛెలిగడ సమీపంలో ఒక బంగారు వర్తకుడి వద్ద నుంచి భారీ ఎత్తున నగదు, బంగారం, వెండి ఆభరణాలు చోరీ జరిగిన విషయం తెలిసిందే. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దీనిలో భాగంగా ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్టు ఎస్పీ జితేంద్రనాథ్ పండా పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఛెలిగడ వద్ద బంగారం వ్యాపారి మోహన్‌రావు ఆచారి దుకాణం మూసివేసి ఒక సంచిలో బంగారం, వెండి ఆభరణాలు, నగదు ఇంటికి వెళ్తుండగా, అది గమనించిన ముగ్గురు వ్యక్తులు ఆ సంచిని ఎత్తుకెళ్లారు. అనంతరం బంగారం వ్యాపారి ఫిర్యాదు చేశాడు. పోలీసులు చేపట్టిన దర్యాప్తులో గంజాం జిల్లా అస్కా పోలీసుస్టేషన్ పరిధి పకలాపల్లి గ్రామానికి చెందిన అజన్‌రావు, సోన్‌పూర్ పీఎస్ పరిధి స్పిన్నింగ్ మిల్ గ్రామానికి చెందిన దయాసాగర్‌లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 477.999 గ్రాముల బంగారం, 3.6 కిలోల వెండి, రూ.40 వేల నగదు, సెల్ ఫోన్లు, ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు కలహండి, సోన్‌పూర్, బొలంగీర్ తదితర ప్రాంతాల్లో ఇదివరకే దొంగతనాలు చేశారని వెల్లడించారు. వీరిలో మరొకరు తప్పించుకున్నాడని ఐఐసీ బసంత్ కుమార్ శెఠి తెలిపారు.

ఒపిలిపి ప్రాజెక్టు కొనసాగించండి

- కలెక్టర్‌కు డొంగిరియాల వినతి



కలెక్టర్ పట్నాయిక్‌కి వినతిపత్రం అందజేసిన డొంగిరియా బృందం

రాయగడ: జిల్లాలోని బిసంకటక్ సమితి పరిధి నియమగిరి పర్వత ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదిమ జనజాతి డొంగిరియా తెగకు చెందిన ఆదివాసీల ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధి కోసం ప్రారంభమైన ఒపిలిపి ప్రాజెక్టును కొనసాగించాలని ఆ ప్రాంత డొంగిరియాలు కలెక్టర్ ఫరూల్ పట్వారీని కోరారు. ఈ మేరకు బిసంకటక్‌లో సోమవారం కలెక్టర్ పర్యటించిన సందర్భంగా ఒక బృందం ఆమెకు వినతిపత్రాన్ని సమర్పించారు. అభివృద్ధికి ఆమడ దూరంలో నియమగిరి పర్వత ప్రాంతాల్లో నివసిస్తున్న డొంగిరియా ప్రజల ఆర్థిక, సామాజిక వికాసానికి 2017–18 ఆర్థిక సంవత్సరంలో ఒపిలిపి ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ ఏడేళ్లలో ఈ ప్రాజెక్టు వలన తాము ఎన్నో సౌకర్యాలను పొందగలిగామని, అన్ని రంగాల్లో అభివృద్ధి చెందగలిగామని డొంగిరియాలు పేర్కొన్నారు. అందువల్ల ఈ ప్రాజెక్టును కొనసాగించాలని లేదంటే మరలా అభివృద్ధికి దూరమవుతామని ఆవేదన వ్యక్తం చేశారు.

దారుణం



రోదిస్తున్న బాధిత మహిళ

భువనేశ్వర్: విధి నిర్వహణలో గర్భిణిపై పైఅధికారి అహంకార వైఖరితో గర్భస్థ శిశువు మృతి చెందిన దారుణమైన ఘటన రాష్ట్రంలో కలకలం రేపింది. కేంద్రాపడా జిల్లాలో ఈ విచారకర ఘటన తలెత్తింది. పైఅధికారి తోటి మహిళగా సాటి మహిళా ఉద్యోగి ప్రసవ వేదన అవగాహన చేసుకోకపోవడంపై సర్వత్రా విచారం వ్యక్తమవుతోంది. కేంద్రాపడా జిల్లా డెరాబిస్ మండలం శిశు, మహిళా అభివృద్ధి విభాగంలో బాధిత మహిళ గమాస్తా. ఈమె 7 నెలల గర్భిణి. ఈ పరిస్థితుల్లో కూడ క్రమం తప్పకుండా వేళ ప్రకారం విధులకు హాజరు అవుతోంది. యథావిధిగా మంగళవారం విధులకు హాజరయ్యేందుకు వచ్చిన తర్వాత కార్యాలయంలో ప్రసవ వేదన సంకేతాలు తారసపడ్డాయి. క్రమంగా వేదన బలం పుంజుకుంటున్న తరుణంలో పైఅధికారి సీడీపీవో అనుమతితో చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్లేందుకు సంప్రదించింది. అధికారి నిరాకరించడంతో వేదనతో విధులు నిర్వహించడంతో పరిస్థితి విషమించింది. తోటి సిబ్బంది తన కుటుంబీకులకు సమాచారం తెలియజేయడంతో హుటాహుటిన కార్యాలయానికి తరలి వచ్చి ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్య పరీక్షలు నిర్వహించిన వైద్య వర్గాలు సకాలంలో చికిత్స అందక గర్భస్థ శిశువు మృతి చెందినట్లు ప్రకటించారు. ఈ విచారకర పరిస్థితుల్లో బాధ్యురాలైన సీడీపీవోపై చర్యలు చేపట్టాలని బాధిత మహిళా ఉద్యోగి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు జిల్లా కలెక్టరుకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేసింది.

సమైక్యత పరుగు ప్రారంభం



వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం మోహన్ తదితరులు

భువనేశ్వర్: జాతీయ సమైక్యత దినం పురస్కరించుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి సమైక్యత పరుగు కార్యక్రమం ప్రారంభించారు. స్థానిక కళింగ స్టేడియంలో మంగళవారం ఉదయం జెండా ఊపి ఈ పరుగుని ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో ఔత్సాహికులు ఈ పరుగులో పాల్గొన్నారు. స్థానిక రాజ్ భవన్ వరకు సమైక్యత పరుగు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు ముఖ్యమంత్రి నివాళులర్పించారు. సాధారణంగా ఏటా అక్టోబర్ 31న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి పురస్కరించుకుని జాతీయ సమైక్యత దినం నిర్వహించడం ఆచారం. ఈ ఏడాది ఆ రోజున దీపావళి కావడంతో ముందస్తుగా వేడుకలు చేపట్టారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా, రెవెన్యూ – విపత్తు నిర్వహణ మంత్రి సురేష్ కుమార్ పూజారి, ఉన్నత విద్య, క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి సూర్య వంశీ సూరజ్, ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ ముఖేష్ మహాలింగ్, పంచాయతీ రాజ్ మంత్రి రవి నారాయణ నాయక్, ఏకామ్ర నియోజక వర్గం ఎమ్మెల్యే బాబూ సింగ్, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీది మాటల ప్రభుత్వం

- మాజీ మంత్రి జగన్నాథ సరక
- గుణుపూర్‌లో జనసంపర్క పాదయాత్ర



పాదయాత్రలో పాల్గొన్న మాజీ మంత్రి సరక, గొమాంగో, సుధీర్ తదితరులు



పాదయాత్ర అభిమానులు, కార్యకర్తలు

రాయగడ: బీజేపీది మాటల ప్రభుత్వమే కాని, చేతల ప్రభుత్వం కాదని రాష్ట్ర మాజీ మంత్రి జగన్నాథ సరక ఎద్దేవా చేశారు. జిల్లాలోని గుణుపూర్‌లో సోమవారం జరిగిన జనసంపర్క పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రజా సంక్షేమ కోసం అమలు చేసిన పథకాలనే అమలు చేస్తున్నారన్నారు. సొంతంగా ప్రజల కోసం ఎటువంటి పథకాలకు శ్రీకారం చుట్టలేదని విమర్శించారు. ప్రజలు ఐదు నెలల బీజేపీ ప్రభుత్వ పనితీరును తెలుసుకున్నారని, ఇక భవిష్యత్‌లో ఆ పార్టీని ఆమోదించరన్నారు. దానా వంటి విపత్కర పరిస్థితులను బీజేపీ ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కోలేకపోవడం దారుణమన్నారు.

ప్రజల ముందుకు వెళ్తాం

ప్రజల కోసం నిరంతరం శ్రమించిన బీజేడీ పార్టీ అధినేత నవీన్ పట్నాయక్ ఇచ్చిన పిలుపు మేరకు నిర్వహించిన జనసంపర్క పాదయత్ర గుణుపూర్‌లో విజయవంతమయ్యిందని మాజీ ఎమ్మెల్యే రఘునాథ గొమాంగో అన్నారు. నవీన్‌పై ఉన్న ఆదరాభిమానాలకు ఈ యాత్ర మచ్చుతునక అని అభిప్రాయపడ్డారు. వేల సంఖ్యలో ప్రజలు ఈ యాత్రలో పాల్గొని నవీన్‌పై తమ అభిమతాన్ని చాటుకున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, సీనియర్ నాయకుడు సుధీర్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

సరికొత్త సమాజాన్ని నిర్మించాలి



ర్యాలీలో పాల్గొన్న మహిళలు



ప్రసంగిస్తున్న ఎస్పీ స్వాతి

రాయగడ: అవినీతిని పెకిలించి సరికొత్త సమాజాన్ని నిర్మించేందుకు అందరూ అడుగులు వేయాలని ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో అవినీతి నిర్మూలన వారోత్సవాలు మంగళవారం నిర్వహించారు. అవినీతి రహిత సమాజం కోసం అందరూ అడుగులు వేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ బిష్ణు ప్రసాద్ పాత్రో, అదనపు జిల్లా కలెక్టర్ భాస్కర రైతా తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

క్లుప్తంగా

ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు గణేష్



గణేష్‌కు ఎంపిక పత్రం అందిస్తున్న ప్రిన్సిపాల్

నరసన్నపేట: నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంపీసీఎస్ తృతీయ సంవత్సరం చదువుతున్న పి.గణేష్ జాతీయ స్థాయిలో జరిగే ప్రీ- రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పి.లత మంగళవారం తెలిపారు. మహారాష్ట్రలోని జలగాన్‌లో నిర్వహిస్తున్న పశ్చిమ జోన్ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ప్రీ-రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఎన్ఎస్ఎస్ పీఓలు పి.ఢిల్లీశ్వరరావు, నాగరాజు అభినందించారు.

బైక్ చోరీపై ఫిర్యాదు

కాశీబుగ్గ: పలాస రైల్వే క్వార్టర్స్ సముదాయంలో ఈ నెల 27న ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని యజమాని రాబిన్స్ కుమార్ మంగళవారం కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభ్యంతరాల స్వీకరణ

శ్రీకాకుళం: జిల్లా కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో పనిచేసేందుకు ఆహ్వానించిన కాంట్రాక్టు టీచింగ్, ఔట్ సోర్సింగ్ నాన్ టీచింగ్ దరఖాస్తులు ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి వివరాలను వెబ్‌సైట్‌లో, సమగ్ర శిక్షా కార్యాలయం నోటీస్ బోర్డులో అందుబాటులో ఉంచినట్లు సమగ్ర శిక్షా జిల్లా ప్రాజెక్టు అధికారి ఎస్.తిరుమల చైతన్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాలు ఉంటే 30, 31 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5లోపు ఫిర్యాదుచేయవచ్చని, జిల్లా కలెక్టర్ మెరిట్ అభ్యర్థుల ఎంపిక జాబితా అందజేస్తారని పేర్కొన్నారు.

గాయపడిన వృద్ధురాలి మృతి



రణస్థలం: మండల కేంద్రంలోని జె.ఆర్.పురంలో సోమవారం జాతీయ రహదారి దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొని గాయపడిన యడ్ల నారాయణమ్మ(78) మంగళవారం విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్సై ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనం చెల్లింపు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 34 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మూడు నెలల వేతనం వారి ఖాతాల్లో మంగళవారం జమచేశారు. వీరు పది నెలలు పనిచేయగా, అక్టోబర్ 10న రెండు నెలలు వేతనం చెల్లించారు. ప్రస్తుతం మూడు నెలల వేతనం చెల్లించారు. ఇంకా ఐదు నెలల వేతన బకాయిలు ఉన్నాయి.

వ్యక్తిపై హత్య కేసు నమోదు



విచారణ చేపడుతున్న పోలీసులు

నందిగాం: మండలంలోని మర్లపాడులో వితంతువు తర్ని వరలక్ష్మి(60) మృతికి కారణమైన వ్యక్తిపై హత్య కేసు నమోదైంది. గ్రామంలో నివాసముంటున్న వరలక్ష్మికి, సమీపంలోనే నివాసముంటున్న మరిది జానకిరామయ్యకు పొలం విషయమై తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో ఈ నెల 22న మరోసారి గొడవ జరగడంతో జానకిరామయ్య కర్రతో వరలక్ష్మి తలపై బాదడంతో తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. వరలక్ష్మి భర్త, కుమారుడు గతంలోనే మృతిచెందారు. ముగ్గురు కుమార్తెలకు వివాహాలు కాగా, కోడలు కన్నవారింటికి వెళ్లిపోయింది. వరలక్ష్మి ఒంటరిగా ఉన్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మృతురాలి చిన్న కుమార్తె రేవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టెక్కలి రూరల్ సీఐ కె.శ్రీనివాసరావు మంగళవారం హత్య కేసు నమోదు చేసి జానకిరామయ్యను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసులో యువకుడు అరెస్టు

సారవకోట: మండలంలోని కురిడింగి గ్రామానికి చెందిన అలికాపు తిరుమలను పోక్సో కేసులో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్ఐ లక్ష్మి నరసింహ తెలిపారు. ఈ నెల 16న గొర్రిబంద పంచాయతీ బురుజువాడ గ్రామానికి చెందిన బాలికను నమ్మించి గర్భవతి చేసినట్లు నమోదైన కేసుపై డీపీటీసీ డీఎస్పీ విచారణ చేపట్టి మంగళవారం ఆ యువకుడిని పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, ఇతర సెక్షన్ల క్రింద అరెస్టు చేసి పాతపట్నం రిమాండ్‌కు పంపించినట్లు ఆయన తెలిపారు.

యువకుడికి సాయం

సోంపేట: మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన తెలుకులు ప్రశాంత్ ఇటీవల మేడ పైనుంచి పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం శ్రీకాకుళంలో చికిత్స పొందుతున్నాడు. అతని వైద్యఖర్చుల నిమిత్తం అదే గ్రామానికి చెందిన టెక్నికల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు రూ.1,36,500ను కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు.



జయపురం: ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినులు



రాయగడ: ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు



పర్లాకిమిడి: ఓటరు చైతన్య ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఓటుహక్కుపై అవగాహన



పర్లాకిమిడి: ఓటుహక్కుపై నృత్య రూపకం



మల్కన్‌గిరి: ఓటుహక్కు నినాదం ప్లకార్డు

రాయగడ: స్థానిక బస్టాండ్ వద్ద జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో పథోత్సవాలు మంగళవారం నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్‌రైతా ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రాదేవి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి నిహారి రంజన్ కుహరో తదితరులు హాజరయ్యారు. యువ ఓటర్ల బాధ్యత, వారి కర్తవ్యానికి సంబంధించి వక్తలు ప్రసంగించారు. అనంతరం ఓటర్ల చైతన్యానికి సంబంధించి పలు కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

జయపురం: స్థానిక మున్సిపల్ పార్కింగ్ యార్డులో ఓటుహక్కుపై అవగాహనకు పథ ఉత్సవం-2025 కార్యక్రమాన్ని జయపురం సబ్ డివిజన్ అధికార యంత్రాంగం మంగళవారం ప్రారంభించింది. వందలాది మంది మహిళలు, విద్యార్థులు ఓటుహక్కు తెలిపే ప్లకార్డులను పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం చేపట్టి నినాదాలు చేశారు. ర్యాలీలో గిరిజన కళాకారులు నృత్యాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ శౌర్య రెడ్డి, ఉప కలెక్టర్ గోపీనాథ్ సామంతరాయ్, జయపురం సబ్ డివిజన్ పోలీసు అధికారి అంకిత కుమార్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి: పట్టణంలో గజపతి ఎన్నికల విభాగం ఆధ్వర్యంలో ఓటర్ల చైతన్య ర్యాలీని మహారాజా బాలుర ఉన్నత పాఠశాల నుంచి రాజవీధి మీదుగా మంగళవారం నిర్వహించారు. అనంతరం శ్రీజగన్నాథ మందిరం ప్రాంగణంలో జరిగిన సాధారణ సమావేశంలో ముఖ్య అతిథిగా ఏడీఎం రాజేంద్ర మింజ్, ఎస్పీ జితేంద్రనాథ్ పండా, డీఆర్‌డీఏ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి గుణనిధి నాయక్, సబ్ కలెక్టర్ అనుప్ పండా, పురపాలక ఈవో గౌరచంద్ర పట్నాయిక్, ఐటీడీఏ పీవో దిలీప్ కుమార్ బెహరా, జిల్లా పరిషత్ ఈవో పృథ్వీరాజ్ మండల్, డిప్యూటీ కలెక్టర్ ప్రాణకృష్ణ పాణిగ్రాహి, తహసీల్దార్ నారాయణ బెహరా తదితరులు పాల్గొన్నారు. 18 ఏళ్లు నిండిన యువత తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని ఏడీఎం రాజేంద్ర సూచించారు. అనంతరం వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమాన్ని జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి అర్చనా మంగరాజ్ పర్యవేక్షించారు.

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో పథోత్సవం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. దీనిలో భాగంగా కొత్త ఓటర్లకు అవగాహన కల్పించారు. అర్హులందరూ ఓటుహక్కు పొందాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్‌శ్వర్ పటేల్, అదనపు కలెక్టర్ వేద్బార్ ప్రధాన్, సబ్ కలెక్టర్ దుర్యోధన్ బోయి, అదనపు ఎస్పీ తపన్ నానాయన్ రౌత్ తదితరులు పాల్గొన్నారు.



రాయగడ: నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు



మల్కన్‌గిరి: ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు



మల్కన్‌గిరి: నృత్యం చేస్తున్న యువతులు

యోగా పరిశోధన కేంద్రం శంకుస్థాపన

- సెంట్రల్ డ్రగ్స్ లేబొరేటరీ ప్రారంభం



సెంట్రల్ డ్రగ్స్ లేబొరేటరీ సందర్శన



శంకుస్థాపన చేస్తున్న సీఎం మోహన్‌చరణ్ మాఝీ

భువనేశ్వర్: రాష్ట్రంలో యోగా, ప్రకృతి వైద్యం కేంద్ర పరిశోధన సంస్థ త్వరలో ఏర్పాటు కానుంది. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం ఈ భవన సముదాయం నిర్మాణానికి వీడియో కాన్ఫరెన్సులో శంకుస్థాపన చేశారు. 100 పడకల ఆయుర్వేదిక ఆస్పత్రితో ఈ భవన సముదాయం సిద్ధం అవుతుంది. ఖుర్దా జిల్లా జట్నీ ప్రాంతంలో దీని నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. నగర శివారు గొతాపట్న ప్రాంతంలో సెంట్రల్ డ్రగ్స్ లేబొరేటరీ భారత ప్రధానమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో 70 ఏళ్లు పైబడిన వయో వృద్ధులకు ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా సౌలభ్యం విస్తరింపజేసినట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ప్రయోగశాల సందర్శించి కార్యాచరణ, ఇతరేతర సదుపాయాల వివరాలు తెలుసుకున్నారు. బర్‌గడ్ జిల్లాలో క్రిటికల్ కేర్ బ్లాక్‌ని ప్రారంభించారు.

త్వరలో ఆయుష్మాన్ భారత్

రాష్ట్ర ప్రజలకు త్వరలో భారత ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా సౌకర్యం అందుబాటులోకి రానుంది. గొతపట్న కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఈ విషయం ప్రకటించారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిజూ స్వాస్థ్య కల్యాణ్ యోజన భారత ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ పథకంతో అనుసంధానపరచి ఆరోగ్య బీమా సౌకర్యాలు కల్పిస్తారు. బిజూ స్వాస్థ్య కల్యాణ్ యోజన సరికొత్త పేరు గోపబంధు జన ఆరోగ్య యోజనగా పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన పథకం కింద దేశవ్యాప్తంగా 70 ఏళ్లు పైబడిన వయో వృద్ధులకు ఆరోగ్య బీమా సౌలభ్యం అక్కరకు వస్తుంది. దీని కింద రూ.5 లక్షల వరకు ఆరోగ్య సేవలు లభిస్తాయి. ఈ లబ్ధి పొందేందుకు అర్హులైన వారు ఆయుష్మాన్ వాయు వందన కార్డు కలిగి ఉండడం అనివార్యం.

స్వర్గద్వార్‌లో పిడకలతో అంత్యక్రియలు

- మంత్రి గోకుల నంద మల్లిక్





పూరీ స్వర్గద్వార్

భువనేశ్వర్: పూరీ సాగర తీరంలో స్వర్గద్వారం అత్యంత విముక్తి శ్మశాన వాటికగా ప్రసిద్ధి. ఈ ప్రాంగణంలో అంత్యక్రియల కోసం సుదూర ప్రాంతాల నుంచి తరలి వస్తుంటారు. స్వర్గ ద్వార్ ప్రాంగణంలో అంత్యక్రియలను మరింత పునీతం చేసే దిశలో ప్రభుత్వం యోచిస్తోంది. పూరీ స్వర్గ ద్వార్‌లో ఆవు పేడ పిడకలతో అంత్యక్రియలు నిర్వహించాలని యోచిస్తున్నట్లు రాష్ట్ర మత్స్య, పశు సంవర్ధక శాఖ మంత్రి గోకుల నంద మల్లిక్ మంగళవారం తెలిపారు. స్వర్గ ద్వార్ పాలక మండలి సంప్రదింపులతో ఈ మేరకు కార్యచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాడి సంపద పరిరక్షణ కోసం కామధేను పథకం ప్రవేశపెట్టింది. ఈ నేపథ్యంలో ఆవు పేడ, మూత్రం సనాతన విలువల పరిరక్షణలో వినియోగం విస్తృతపరిచేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు కానుంది. ఉప ముఖ్యమంత్రి అధ్యక్షతన 5 మంది మంత్రులు, 5 మంది కార్యదర్శులతో ఈ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

విభిన్న జాతుల చేపల పెంపకం లాభదాయకం



కరదీపికను ఆవిష్కరిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు, మత్స్యకార రైతులు

ఆమదాలవలస: విభిన్న జాతుల చేపల పెంపకంతో రైతులకు మెరుగైన ఆదాయం లభిస్తుందని కృషివిజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమదాలవలసలోని కృషివిజ్ఞాన కేంద్రంలో జాతీయ మత్స్య అభివృద్ధి మండలి హైదరాబాద్, కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా నిర్వహించిన వృత్తి విద్య శిక్షణా ముగింపు కార్యక్రమంలో రైతులకు శిక్షణ పత్రాలు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ బాలకృష్ణ మాట్లాడుతూ చేపలకు తరచూ వచ్చే వ్యాధులపై అవగాహన కలిగి నివారణ పద్ధతులు అమలు చేస్తే దిగుబడులను పెంచుకోవచ్చని తెలిపారు. అనంతరం 'చేపల పెంపకంలో ఉత్తమ యాజమాన్య పద్ధతులు' పేరిట రూపొందించిన కరదీపికను రైతులకు అందించారు. కార్యక్రమంలో ఎంపీఈడీఏ విశాఖపట్నం డైరెక్టర్ ప్రసాద్‌నాయక్, నాక్సా (ఎన్‌సీఎస్ఏ) కో-ఆర్డినేటర్ బాలాజీ, మత్స్య శాఖ సహాయ సంచాలకులు సంతోష్ తదితరులు పాల్గొన్నారు..

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన అవసరం



పర్లాకిమిడి: సమావేశంలో పాల్గొన్న అధికారులు

రాయగడ: ప్రకృతి వైపరీత్యాలపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్‌రైతా అన్నారు. ప్రకృతి వైపరీత్యాలపై చైతన్యం కార్యక్రమంలో భాగంగా జిల్లా యంత్రాంగం స్థానిక ఎఫ్‌సీఐ గోదాం రహదారి వద్ద ఏర్పాటు చేసిన మినీ మారథాన్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు చెప్పిరావని, అవి సంభవించే సమయంలో సమర్థవంతంగా ఎదర్కొవాలంటే వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాశాఖ అధికారి షేక్ ఆలీనూర్, జిల్లా ప్రజా సంబంధాల శాఖ అధికారి బసంత కుమార్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి: తుఫాన్‌లు ఎదుర్కోవడంలో ఒడిశా అనేక పాఠాలు నేర్చుకున్నదని, దేశంలో ప్రకృతి వైపరీత్యాలు ఎదుర్కోవడంలో జాతీయ స్థాయిలో ఒడిశా పేరుగాంచిందని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి డా.గుణనిధి నాయక్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ కాన్ఫరెన్సు హాల్‌లో ఏడీఎం రాజేంద్ర మింజ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అనుప్ పండా, అత్యవసర పరిస్థితి అధికారి జగన్నాథ పాఢి, సబ్ డివిజనల్ పోలీసు అధికారి మాధవానంద నాయక్ తదితరులు పాల్గొన్నారు.



రాయగడ: మినీ మారథాన్‌లో పాల్గొన్న విద్యార్థులు

శిల్పాశెట్టి వీడియో దుమారం



లింగరాజ దేవస్థానం ప్రాంగణంలో శిల్పాశెట్టి

భువనేశ్వర్: నటి, సెలబ్రిటీ శిల్పాశెట్టి ఇన్‌స్టాగామ్ ఖాతాలో లింగరాజ మందిరం వీడియో ప్రసారం తీవ్ర దుమారం రేపింది. దీనిపై ఏకామ్ర క్షేత్ర అధికార యంత్రాంగం ఘాటుగా స్పందించింది. ఈ వ్యవహారంలో సూత్రధారిగా వ్యవహరించిన సేవాయత్‌కు పాలన యంత్రాంగం వివరణ కోరుతు తాఖీదు జారీ చేసింది. లింగరాజ ఆలయం కార్య నిర్వహణ అధికారి, అదనపు జిల్లా మేజిస్ట్రేటు రుద్ర నారాయణ మహంతి, ఆలయం సేవాయత్ సేవా సూపర్‌వైజరు రాజ కిషోర్ మహాపాత్రో పేరుతో ఈ తాఖీదులు జారీ అయ్యాయి. సంతృప్తికర వివరణ దాఖలు చేసేందుకు 7 రోజులు గడువు మంజూరు చేసింది. దాఖలైన వివరణ ఆధారంగా తదుపరి చర్యలు చేపడతారు.

జాతీయ ఫెన్సింగ్ పోటీలకు ఇద్దరు ఎంపిక



క్రీడాకారులతో బలభద్రుని రాజా, కోచ్, పీడీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ స్కూల్‌గేమ్స్ ఫెన్సింగ్ పోటీల్లో విజేతలై జిల్లా ఖ్యాతిని చాటిచెప్పాలని జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని రాజా పిలుపునిచ్చారు. ఇటీవలి నంద్యాలలో జరిగిన 68వ ఏపీ రాష్ట్రస్థాయి అండర్-17 స్కూల్‌గేమ్స్ పోటీల్లో రాణించి బంగారు పతకాలు సాధించిన జిల్లాకు చెందిన ఫెన్సింగ్ క్రీడాకారులు ఎల్.డార్విన్, పి.అమనిలను మంగళవారం శ్రీకాకుళంలోని ఫెన్సింగ్ శిక్షణా కేంద్రం వద్ద అభినందించారు. ఇందులో ఎల్.డార్విన్ జెడ్పీహెచ్‌స్కూల్‌లో కరకవలసలో చదువుతుండగా, పి.అమని జెడ్పీహెచ్ స్కూల్ సతివాడలో చదువుతోంది. వీరు నవంబర్ 17 నుంచి జమ్మూకాశ్మీర్‌లో జరగనున్న ఆలిండియా స్కూల్‌గేమ్స్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్-2024 పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. పోటీలకు వెళ్లేందుకు అసోసియేషన్ తరపున తైక్వాండో శ్రీను ఆధ్వర్యంలో సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో కోచ్ వంశీ, పీడీలు భవానీ, డి.యశోద, అనిత, పి.రాములమ్మ, రాహుల్ పాల్గొన్నారు.

క్రికెట్ ఆడుతూ యువకుడు మృతి



కృష్ణ ప్రసాద్(ఫైల్)

నరసన్నపేట: మండలంలోని సత్యవరం గ్రామానికి చెందిన యగళ్ల కృష్ణప్రసాద్ అలియాస్ సంతోష్ (25) క్రికెట్ ఆడుతూ గుండెపోటుకు గురై మృతి చెందాడు. బీటెక్ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ కొలువు సాధించిన కృష్ణప్రసాద్‌కు క్రికెట్ అంటే మక్కువ. స్నేహితులతో కలిసి ఆదివారం హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో క్రికెట్ ఆడుతూ అలసట ఉందని తన గదికి వచ్చేశాడు. గుండెపోటు రావడంతో స్నేహితులు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహాన్ని మంగళవారం సత్యవరం తీసుకొచ్చి అంత్యక్రియలు పూర్తి చేశారు. కుమారుడు ఇక లేడని తెలిసి తల్లిదండ్రులు కృష్ణమూర్తినాయుడు, సూర్య కుమారి తల్లడిల్లిపోయారు. విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య, ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతు రామారావు తదితరులు, మేజరు పంచాయతీ వార్డు సభ్యులు ఇప్పిలి నీలం సంతాపం వ్యక్తం చేశారు.

సీసీ కెమెరాలకు చిక్కిన చైన్‌స్నాచర్లు



బైక్‌పై వెళ్తున్న దుండగులు వీరే..

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో సోమవారం జీడి కార్మికురాలి మంగళసూత్రం తెంచుకుని బైక్‌పై పరారైన చైన్‌స్నాచర్ల చిత్రాలు కేటీ రోడ్డులోని సీసీ కెమెరాకు చిక్కాయి. గొలుసు రోల్డ్ గోల్డ్ అని తెలిసి పడేసి పరారవుతున్న దృశ్యాలు అందులో నిక్షిప్తమయ్యాయి. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నైపుణ్యాలతోనే ఉజ్వల భవిష్యత్

శ్రీకాకుళం పాతబస్టాండ్: విద్యార్థులు ఏ కోర్సు చదివినా అందులో నైపుణ్యం ఉన్న వారికే ఉద్యోగ అవకాశాలు దక్కుతున్నాయని, అందుకే యువతకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఏ కార్యాలయ సమావేశ మందిరంలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 'నైపుణ్య గణన -2024' జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఆటోమేషన్, కృత్రిమ మేథ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న సిబ్బంది మున్సిపాలిటీలు, గ్రామ స్థాయి సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. నవంబర్ మొదటి వారంలో నైపుణ్యగణన ప్రారంభించాలన్నారు. అనంతరం మాస్టర్ ట్రైనర్ ధర్మేంద్ర పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ/వార్డు సచివాలయాల జిల్లా కో-ఆర్డినేటర్ ఉదయ్,ఎ.పి.ఎస్.ఎస్.డి.సి సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

దరఖాస్తు గడువు పెంపు

విజయనగరం ఫోర్ట్: డిప్లమా ఇన్ పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పెంచినట్టు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 3వ తేదీ సాయంత్రం 5 గంటలులోగా రూ.100 దరఖాస్తు రుసుంతో ప్రభుత్వ వైద్య కళాశాలలో అందజేయాలన్నారు.

పైడితల్లికి బంగారు ముక్కుపుడక



పైడితల్లికి అలంకరించిన అమెరికన్ డైమండ్స్ ముక్కుపుడుక

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారికి అమెరికన్ డైమండ్స్‌తో కూడిన 4.555 గ్రాముల బంగారు ముక్కుపుడకను ఆలయ పూర్వపు ఈఓగా పనిచేసిన జీవీవీఎస్ఆర్ సుబ్రహ్మణ్యం మంగళవారం సమర్పించారు. ప్రస్తుత ఈఓ డీవీవీ ప్రసాదరావు ఆధ్వర్యంలో వేద పండితులు అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజాదికాలు చేసి ముక్కుపుడకను సర్వాంగ సుందరంగా అలంకరించారు.

పాఠశాలలకు హెల్త్ కార్డులు

విజయనగరం ఫోర్ట్: రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా స్కూల్ హెల్త్ కార్డ్స్ జిల్లాలో గల అన్ని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల పరిధిలో గల పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేశామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 నెలల నుంచి ఐదు సంవత్సరాల పిల్లలకు అంగన్‌వాడీ సెంటర్స్‌కు, ఒకటివ తరగతి నుంచి 5వ తరగతి పిల్లలకు, ఆరవ తరగతి నుంచి 10వ తరగతి పిల్లలకు అన్ని స్కూళ్లకు ఇవ్వడం జరిగిందని తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్స్‌కు 68,121 హెల్త్ కార్డులు, ఎలిమెంటరీ స్కూల్ పిల్లలకు 59,853 హెల్త్ కార్డులు, 6వ తరగతి నుంచి 10వ తరగతి పిల్లలకు 89,602 హెల్త్ కార్డులు పంపిణీ చేసామని తెలిపారు.

రెండు పూరిళ్లు దగ్ధం



కాలిపోయిన ఇళ్లు

రేగిడి: మండలంలోని అంబఖండి గ్రామంలో ముద్దాడ కన్నమ్మ, ముద్దాడ చిన్నప్పమ్మలకు చెందిన రెండు పూరిళ్లు మంగళవారం కాలిపోయాయి. కన్నమ్మ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. తిండి గింజలతో పాటు వస్తు సామగ్రి కాలిపోవడంతో బాధితులు విలపిస్తున్నారు. సర్పంచ్ శాసపు గోవిందనాయుడు, ఎంపీటీసీ పుర్లి సత్యవతి బాధితులను పరామర్శించి, ప్రభుత్వం తరపున ఇళ్ల మంజూరుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

మహిళకు గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు

బాడంగి: కట్టెల పొయ్యిపై వేడి నీటిని కాచుకొని దాన్ని దించే క్రమంలో ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకొని ఓ మహిళ కాలి తీవ్రంగా గాయపడింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని మల్లంపేట గ్రామానికి చెందిన పట్నాన శివకుమారి(55) మంగళవారం అగ్ని ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఎడమ వైపు చేతి నుంచి పక్కటెముకలు, కాలు బాగా కాలిపోయాయి. 108లో స్థానిక ఆస్పత్రిలో చేరింది. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం ఆస్పత్రికి రిఫర్ చేశారు. శివకుమారి భర్త సత్యం నాలుగేళ్ల కిందటే మృతి చెందడంతో ఆమె కన్నవారి ఇంటి వద్దే తల్లి చిన్నమ్మితోనే జీవనం సాగిస్తోంది. తల్లి చిన్నమ్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



ఖోఖో క్రీడా పోటీలో పాల్గొన్న ఉమ్మడి జిల్లాల విద్యార్థులు

గజపతినగరం: క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఉప విద్యాశాఖాధికారి మోహనరావు అన్నారు. మండలంలోని మరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్ 14, 17 బాలుర, బాలికల జిల్లా ఖోఖో పోటీలను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణించాలనఅనరు. ఉమ్మడి జిల్లాల నుంచి 500 మంది విద్యార్థులు పాల్గొనడం ఆనందంగా ఉందని వారిని అభినందించారు. ఇందులో ప్రతిభ చూపిన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. సర్పంచ్ రెంక రామలక్ష్మి, హైస్కూల్ హెచ్ఎం నాగమణి, నియోజకవర్గ క్రీడల ఇన్‌చార్జి చింత సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

- జిల్లాలో బాలికలు, మహిళలపై పెరుగుతున్న దాడులు
- ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు 11 పోక్సో కేసులు నమోదు
- రేప్ కేసులు 4
- మహిళలపై నమోదు అయిన ఇతర కేసులు 45

కాటేస్తున్న మానవమృగాలు



' రామభద్రపురం మండలానికి చెందిన 6 నెలల వయసు గల బాలికపై తాత వరుస అయిన ఎరకన్న దొర అనే వ్యక్తి ఈ ఏడాది జూలై 13వ తేదీన లైంగికదాడికి పాల్పడ్డాడు. పోలీసులు అతనిని అరెస్టుచేసి పోక్సో కేసు నమోదు చేశారు.'

' విజయనగరంలోని 18 ఏళ్ల బాలికపై ఆగస్టు 10వ తేదీన వరుసకు చిన్నాన్న అయిన శ్రీనివాసరావు అనే వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అతనిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.'

'గంట్యాడ మండలం కొతారుబిల్లి కూడలిలో ఈనెల 27వ తేదీన అనకాపల్లికి చెందిన మూడున్నరేళ్ల బాలికపై 25 ఏళ్ల వయసు గల విజినిగిరి రవి అనే వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఇతనిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.'

'తాజాగా కొండ వెలగాడ ఉన్నత పాఠశాలలో చదువుతున్న బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడన్న ఫిర్యాదు మేరకు పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు మత్స వెంకటరావుపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.'



విజయనగరం ఫోర్ట్: ప్రశాంతగా ఉండే విజయనగరం జిల్లాలో ఇటీవల కాలంలో బాలికలు, మహిళలపై దాడులు అధికమయ్యాయి. భద్రత కరువైంది. కొందరు మానవమృగాలుగా మారి చిన్నారులు, మహిళలపై లైంగిక దాడులు చేస్తున్నారు. వారి జీవితాలను చిదిమేస్తున్నారు. మానవత్వాన్ని మంటగలుపుతూ అభంశుభం తెలియని చిన్నారులపైనా కర్కశంగా వ్యవహరిస్తున్నారు. కుతూరు, మనమరాలు వయసు ఉన్నవారిపై సభ్యసమాజం తలదించుకునేలా అత్యాచారాలకు పాల్పడుతున్నారు. ఈ చర్యలతో ఆడపిల్లలను ఇంటి నుంచి బయటకు పంపించేందుకు తల్లిదండ్రులు హడలిపోతున్నారు. బాలికలు బయట కనిపిస్తే కామాంధులు ఏ వైపు నుంచి కాటేస్తారోనని భయపడుతున్నారు. ఇంతటి దారుణ పరిస్థితులు గతంలో ఎన్నడూ చూడలేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రక్షణ కల్పించాలని, కామాంధులను కఠినంగా శిక్షించాలని టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.



ఆరునెలల్లో 11పోక్సో కేసుల నమోదు

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 11 పోక్సో కేసులు నమోదయ్యాయి. ఆడపిల్లలు మిస్సింగ్ కేసులు రెండు, 18-35 ఏళ్ల వయసు గల మహిళలపై రేప్ కేసులు మూడు, 35-60 ఏళ్ల వయసు గల మహిళపై రేప్ కేసు ఒకటి నమోదైంది. మహిళల మిస్సింగ్ కేసులు ఐదు, మహిళలకు సంబంధించి ఇతర కేసులు 45 నమోదయ్యాయి.

బాధాకరం



బాలికలపై లైంగిక దాడులకు పాల్పడడం బాధాకరం. తల్లిదండ్రులు మగ పిల్లలకు నైతిక విలువలు, సత్ప్రవర్తన గురించి చిన్నతనం నుంచి తెలియజేయాలి. మగ పిల్లల ప్రవర్తనను కూడా తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి. బాలికలకు పాఠశాలలు, కళాశాలల్లో గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించాలి.

– బి.శాంతకుమారి, పీడీ, ఐసీడీఎస్

పోక్సో చట్టం ఏం చెబుతుంది..

18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న వారిపై లైంగిక నేరాలు జరిగితే పోక్సో చట్టం కిందకు వస్తుంది. 2012 నుంచి ఈ చట్టం అమలులోకి వచ్చింది. అశ్లీల ప్రయోజనాల కోసం పిల్లలను ఉపయోగించడం, పిల్లలకు అశ్లీల చిత్రాలు చూపడం వంటివి పోక్సో చట్టం పరిధిలోకి వస్తాయి. ఈ చట్టం కింద నమోదైన కేసుల్లో నిందితులకు నేరం తీవ్రతను బట్టి జైలు శిక్ష ఉంటుంది. బాధితురాలికి పునరావాసం, నష్ట పరిహారం చెల్లిస్తారు. పోక్సో కేసులను విచారించేందుకు ప్రత్యేక న్యాయస్థానాలు ఉన్నాయి. పోక్సో చట్టం ప్రకారం కేసు దర్యాప్తు నేరం జరిగిన తేదీ నుంచి నెల వ్యవధిలో పూర్తి చేయాలి.

విద్యుత్ భారం చంద్రబాబు పాపమే

- ప్రజలపై భారం వేయడమే చంద్రబాబు సంపద సృష్టా?
- డిస్కంలను అప్పులుపాలు చేసి, విద్యుత్ రంగాన్ని నాశనం చేసినది చంద్రబాబే
- బషీర్‌బాగ్ ఘటనను ప్రజలు మర్చిపోలేదు
- విద్యుత్‌రంగాన్ని సమర్థవంతంగా నిర్వహించిన ఘనత మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదే..



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: సర్దుబాటు పేరుతో వినియోగదారులపై విద్యుత్ చార్జీల భారం వేసిన పాపం సీఎం చంద్రబాబుదేనని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర విమర్శించారు. సాలూరు పట్టణంలోని తన స్వగృహంలో విలేకరులతో మంగళవారం మాట్లాడారు. ప్రజలు ఇబ్బంది పడేలా విద్యుత్ చార్జీలు పెంచడమే బాబు సంపద సృష్టా అని ప్రశ్నించారు. విద్యుత్‌భారం ప్రజలకు చంద్రబాబు ఇస్తున్న దీపావళి కానుకా పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి... అధికారంలోకి వచ్చిన నాలుగునెలల్లోనే పెంచడం దారుణమన్నారు. సర్దుబాటు చార్జీలను ప్రభుత్వమే భరించాలని ఏపీఈఆర్సీ విచారణలో పాల్గొన్న వివిధ వర్గాలు కోరినా పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. అనవసర విద్యుత్ కొనుగోలు ఒప్పందాల కారణంగా డిస్కింలను అప్పులు పాలచేసి విద్యుత్ రంగాన్ని గతంలో చంద్రబాబు నాశనం చేశారని విమర్శించారు. అవసరం లేకపోయినా పీపీఏలను అధిక ధరలకు కుదుర్చుకోవడంతో విద్యుత్ సంస్థలపై 25 ఏళ్ల పాటు ఏటా అదనంగా రూ.3,500 కోట్ల భారం పడుతుందని తెలిపారు. 2014-19లో చంద్రబాబు పాలనలో డిస్కింల సంచిత నష్టాలు రూ.28,715 కోట్లు పెరిగాయని (4.35 శాతం) చెప్పారు. కాలానుగుణంగా ట్రూ అప్ పిటీషన్లను ఏపీఈఆర్సీకి దాఖలు చేయకపోవడంతో అవి పెండింగ్‌లో ఉండిపోయాయన్నారు. ఆ భారాన్ని పూర్తిగా వినియోగదారులపై మోపకుండా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అతి తక్కువ భారాన్ని మోపగా, నాడు టీడీపీ, జనసేన పార్టీలు నానా రాద్ధాంతం చేశాయని వివరించారు. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రజలపై విద్యుత్ భారం మోపుతూ ఆ నిందను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నెట్టే కుట్రలు చేయడం దారుణమన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.43,744 కోట్లను ఉచిత వ్యవసాయ విద్యుత్ సబ్సిడీ కింద చెల్లించిందన్నారు. రైతులకు ఉచిత కరెంట్ నిరాటంకంగా అందాలని కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకితో యూనిట్ ఖరీదు కేవలం రూ.2.49కే అత్యంత పారదర్శకంగా ఒప్పందం కుదుర్చుకుందన్నారు. సెకీతో ఒప్పందంపై నానారకాలుగా మాట్లాడుతున్న చంద్రబాబు దమ్ముంటే దానిని రద్దు చేయాలన్నారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ఐదేళ్లలో ఒక్కసారి కూడా పవర్‌హాలిడే విధించకుండా జగన్‌సర్కార్ విద్యుత్ రంగాన్ని సమర్థవంతంగా నిర్వహించిందని గుర్తు చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వీటీపీఎస్, కృష్ణపట్నం విద్యుత్ కేంద్రాలను పూర్తిచేసి జాతికి అంకితం చేశారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అనేక విద్యుత్‌రంగ ప్రాజెక్టుల నిర్మాణాలకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. వాటిని అటకెక్కించేందుకు నేటి కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుండడం విచారకరమన్నారు. విద్యుత్ చార్జీల పెంపుపై ప్రశ్నించిన ప్రజలను బషీరాబాగ్‌లో గుర్రాలతో తొక్కించి, తుపాకీలతో కాల్పులు జరిపిన చరిత్ర చంద్రబాబుదేనని అన్నారు. ప్రజలపై విద్యుత్ భారం వేయడం తగదని, నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. లేదంటే ప్రజల తరపున వైఎస్సార్‌సీపీ ఉద్యమిస్తుందని స్పష్టం చేశారు. ప్రజాక్షేత్రంలో చంద్రబాబు తప్పిదాలను ఎండగడతామని హెచ్చరించారు.

నవంబర్ నుంచి వసతిగృహాల్లో రాత్రి బస

పార్వతీపురం: వసతిగృహాల్లో ప్రత్యేకాధికారులు నవంబర్ నుంచి రాత్రి బస చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి మండల ప్రత్యేకాధికారులు, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ మంగళవారం నిర్వహించారు. గురువారం రాత్రి వసతిగృహంలో బస చేసి శుక్రవారం ఉదయం 6గంటల నుంచి గ్రామంలో పర్యటన చేయాలన్నారు. గ్రామంలో బహిరంగ మలవిసర్జన జరగకుండా అవగాహన కల్పించడంతో పాటు తాగునీరు, రక్తహీనత ఉన్న పిల్లల గుర్తింపు, గృహ నిర్మాణాల స్థితిగతులను పరిశీలించాలన్నారు. యడ్ల బళ్లు, ట్రాక్టర్లతో గృహ నిర్మాణాల కోసం ఇసుకను తరలించవచ్చునన్నారు. నవంబర్ 9 నుండి ఫిబ్రవరి 8 వరకు ప్రతీ రోజు ఆన్‌లైన్ టెస్టులు నిర్వహించడం జరుగుతుందన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ జి.కేశవనాయుడు, సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీ వాత్సవ, యశ్వంత్ కుమార్‌రెడ్డి , ఏపీడీసీఎల్ ఎస్ఈ చలపతిరావు, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: మాదక ద్రవ్యాల నియంత్రణపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణపై జిల్లా స్థాయి సమావేశాన్ని మంగళవారం తన చాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నియంత్రణపై జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. వసతిగృహాలు, పాఠశాలల్లో మాదక ద్రవ్యాల అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో నిఘా పటిష్టం చేయాలన్నారు. పోలీసు సూపరింటెండెంట్ ఎస్‌వీ మాధవ రెడ్డి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. 2024లో మొత్తం 28కేసులు నమోదు కాగా 56మందిని అరెస్టు చేసినట్టు అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్ తెలిపారు. సమావేశంలో జిల్లా అటవీ అధికారి జీపీవీ ప్రసూన, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి బి.వాగ్దేవి తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అభినయ శ్రీనివాస్, తదితరులు

విజయనగరం టౌన్: అభినయ, నాటకశాల సంయుక్త ఆధ్వర్యంలో నటరత్న నాటక పరిషత్ 8వ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలను నవంబరు 9, 10, 11 తేదీల్లో నిర్వహించనున్నట్టు అభినయ సంస్థ అధ్యక్షుడు అభినయ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక శివాలయం వీధిలో ఉన్న నాటకశాలలో నాటిక పోటీల విశేషాలతో కూడిన కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురజాడ కళాభారతి వేదికగా మూడు రోజుల పాటూ ప్రతీ రోజూ సాయంత్రం 6 గంటల నుంచి నాటిక పోటీలు ఉంటాయన్నారు. 9న తెలంగాణా హైదరాబాద్ కళాంజలి సంస్థ కొల్లా రాధాకృష్ణ దర్శకత్వంలో రైతే రాజు సాంఘిక నాటిక, రాత్రి 8 గంటలకు నాటకశాల ఆధ్వర్యంలో బంధనం ప్రదర్శన ఉంటుందన్నారు. 10న గుంటూరు కట్రపాడు ఉషోదయ కళానికేతన్స్ చెరుకూరి సాంబశివరావు రచన, దర్శకత్వంలో విముక్తి సాంఘిక నాటిక, అనంతరం హైదరాబాద్ గోవాడ క్రియేషన్స్ వెంకట్ దర్శకత్వంలో మూల్యం సాంఘిక నాటిక ప్రదర్శన ఉంటుందన్నారు. 11న గుంటూరు అభినయ ఆర్ట్స్ ఎన్.రవీంద్రారెడ్డి దర్శకత్వంలో ఇంద్రప్రస్థం, శ్రీకాకుళం బొరివంక, శార్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సంఘం బీఎమ్ఎస్.పట్నాయక్ ఆధ్వర్యంలో కొత్తపరిమళం సాంఘిక నాటిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. నాటకశాల కార్యదర్శి గెద్ద వరప్రసాద్, భోగరాజు సూర్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య గణనకు సిద్ధంకండి : జేసీ



మాట్లాడుతున్న జేసీ సేతుమాధవన్

విజయనగరం అర్బన్: నైపుణ్య గణన - 2024 నిర్వహించేందుకు సిద్ధం కావాలని జేసీ ఎస్.సేతు మాధవన్ ఆదేశించారు. స్కిల్ సర్వే నిర్వహణకు మండలాల నుంచి ఎంపిక చేసిన మాస్టర్ ట్రైనర్లకు స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ నైపుణ్య గణన కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టనుందన్నారు. త్వరలో నిర్వహించబోయే గణనకు అన్ని విధాలా సంసిద్ధులుగా ఉండాలన్నారు. సచివాలయ సిబ్బంది ద్వారా ఈ సర్వే జరుగుతుందన్నారు. నిబంధనలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలని, ఇంటింటి సర్వే కోసం వెళ్లినప్పుడు ఈ గణన అవసరాన్ని యువతకు వివరించి, వారి నుంచి వివరాలను సేకరించాలన్నారు. దీనికి సంబంధించిన యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సిన అంశాలపై సందేహాలను నివృత్తి చేశారు. కచ్చితంగా, సంపూర్ణమైన వివరాలతో గణనను పూర్తి చేయాలని జేసీ కోరారు. శిక్షణలో జిల్లా నైపుణ్యాధికారి జి.ప్రశాంత్‌కుమార్, జిల్లా ఉపాధి అధికారి డి.అరుణ, రాష్ట్ర స్థాయి మాస్టర్ ట్రైనర్ పృధ్వీ, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా బాధ్యులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులంతా ఓటరుగా నమోదు కావాలి

- డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి

విజయనగరం అర్బన్: జనవరి 2025 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి అన్నారు. భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నెల 29న డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్స్ పబ్లికేషన్ జరుగుతుందని, ఆ రోజు నుంచి నవంబర్ 28 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ జరుగుతుందని తెలిపారు. ఈ నెల రోజుల్లో ఓటర్ల జాబితాల్లో చేర్పులు, మార్పులు, తొలగింపులు చేపట్టడం జరుగుతుందని, ఫారం 6, ఫారం 7, ఫారం 8ల ద్వారా ఆన్‌లైన్‌లోగానీ, నేరుగా పోలింగ్ స్టేషన్ వద్దగానీ నమోదు చేసుకోవచ్చని తెలిపారు. క్లెయిమ్స్, అభ్యంతరాలను డిసెంబర్ 12 లోగా పరిష్కరించడం జరుగుతుందన్నారు. తుది ఓటర్ల జాబితాను జనవరి 6న ప్రచురిస్తామని తెలిపారు. తన చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ స్థాయిలో నవంబర్ 9, 10, 23, 24 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పెషల్ కాంపెయిన్ నిర్వహించడం జరుగుతుందని, బీఎల్‌ఓలు బూత్ వద్దనే ఉండి క్లెయిమ్‌లను, అభ్యంతరాలను స్వీకరిస్తారని తెలిపారు. సందేహాల కోసం ఓటర్స్ హెల్ప్ లైన్ 1950 నంబరుకు కాల్ చేసి తెలుసుకోవచ్చునని తెలిపారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నుంచి నరసింహమూర్తి, టీడీపీ నుంచి ఐ.వి.పి.రాజు, కాంగ్రెస్ నుంచి సతీష్‌కుమార్, బీజేపీ నుంచి అప్పారావు, ఎన్నికల సూపరింటెండెంట్ భాస్కరరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతగా అక్షరాస్యత కార్యక్రమం

- ఎంపీడీఓలు, ఏపీఎంలకు కలెక్టర్ పిలుపు



ప్రచార పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్, తదితరులు

విజయనగరం అర్బన్: జిల్లా అభివృద్ధి సాధనలో ప్రధాన అడ్డంకిగా వున్న నిరక్షరాస్యతను రూపుమాపేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నవభారత్ సాక్షరత కార్యక్రమం గొప్ప అవకాశమని, దీనిని విజయవంతం చేసేందుకు మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ డా.బి.ఆర్.అంబేడ్కర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని నిరక్షరాస్యులైన 48,578 మంది స్వయంశక్తి మహిళలను అక్షరాస్యులుగా రూపొందించి జిల్లాను వచ్చే ఆరు నెలల కాలంలో సంపూర్ణ అక్షరాస్యత దిశగా నడిపించాలన్నారు. నవభారత్ సాక్షరత కార్యక్రమంపై వయోజన విద్యా శాఖ రూపొందించిన పోస్టర్లను, శిక్షణకు ఉద్దేశించిన పుస్తకాలను కలెక్టర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు ఎంపీడీఓలు వ్యక్తిగతంగా శ్రద్ధ చూపించాలన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.కళ్యాణచక్రవర్తి మాట్లాడుతూ నిరక్షరాస్యత అనే సామాజిక రుగ్మతను తొలగించేందుకు చిత్తశుద్ధితో పని చేయాలని ఎంపీడీఓలు, వెలుగు ఏపీఎంలను కోరారు. స్వయంశక్తి సంఘాల్లో విద్యావంతులైన మహిళలను గుర్తించి వారి ద్వారా ఒక్కో మహిళ మరో పది మందికి చదువు నేర్పేలా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. వయోజన విద్య శాఖ ఉప సంచాలకులు ఎ.సోమేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో సంపూర్ణ అక్షరాస్యత సాధించేందుకు 2024 నుంచి 2027 వరకు నవభారత్ సాక్షరత కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. జిల్లా పరిషత్ సీఈఓ సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో అక్షరాస్యత ఎంతో కీలకమని పేర్కొన్నారు. జిల్లా పంచాయతీ అధికారి టి.వెంకటేశ్వరరావు, జిల్లాపరిషత్ డిప్యూటీ సీఈఓ వెంకటరామ, మహిళాశిశు సంక్షేమ శాఖ పీడీ శాంతకుమారి, డీపీఆర్‌ఓ డి.రమేష్ పాల్గొన్నారు.

ఉయ్యాలో.. ఉయ్యాలా..

- నేత్రపర్వంగా పైడితల్లి ఉయ్యాల కంబాల మహోత్సవం
- నారింజ పండ్లతో అమ్మవారికి నివేదన
- బుధవారం నుంచి వనంగుడిలో కొలువు దీరనున్న పైడితల్లి



చదురుగుడిలో పుష్పాలంకరణలో పైడితల్లి



ఉయ్యాలలో ఉన్న ఘటాలకు పూజలు చేస్తున్న భక్తులు

విజయనగరం టౌన్: భక్త కోటికి సిరులిచ్చే చిన్నారి పైడిమాంబ ఊయల ఊగుతూ భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తింది. మంగళవారం రాత్రి కన్నులపండువగా సాగిన ఉయ్యాలకంబాల ఉత్సవాన్ని తిలకించిన భక్తులు తన్మయత్వం చెందారు. చదురుగుడి ఆవరణలో ప్రత్యేకంగా అలంకరించిన ఉయ్యాల చుట్టూ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని మూడుసార్లు ప్రదక్షిణ జరిపారు. అనంతరం సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు సమక్షంలో ఉయ్యాలలో ఆశీనులను చేసి శాస్త్రోక్తంగా ఉయ్యాకంబాల ఉత్సవ ఘట్టాన్ని పూర్తిచేశారు.

తరలివచ్చిన భక్తలోకం

సిరిమానోత్సవం రోజు అమ్మవారిని దర్శించుకోలేని భక్తులు ఉయ్యాల కంబాల ఉత్సవం రోజున అమ్మవారి సేవలో తరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సుమారు 50వేల మంది అమ్మవారిని దర్శించుకున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. అమ్మవారి దర్శనానికి ఉదయం నుంచే భక్తులు బారులు తీరాయి. తొలేళ్లు, సిరిమానోత్సవం రోజులు తలపించాయి. మధ్యాహ్నం 2 గంటల వరకు క్యూలు రద్దీగా కనిపించాయి. పైడితల్లికి ఘటాలు సమర్పించారు. మొక్కుబడులు చెల్లించారు. వివిధ వేషధారణలతో కళాకారులు ఆకట్టుకున్నారు. ఆలయ ఆవరణలో విశాఖపట్టణానికి చెందిన సర్వేజనా సుఖినోభవంతు బి.ఎస్.సత్యమాధవి, వరలక్ష్మి, సునీతల ఆధ్యాత్మిక గ్రూపుకు చెందిన మహిళలు అమ్మవారిని కీర్తిస్తూ ఆలపించిన భక్తిగీతాలు ఆద్యంతం భక్తులను అలరించాయి. పలు స్వచ్ఛంద సంస్థలు, దేవదాయశాఖ సిబ్బంది భక్తులకు మంచినీరు, పులిహోర, మజ్జిగ, ప్రసాదం ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామతీర్థం ఈఓ వై.శ్రీనివాసరావు, ఆలయ సూపర్‌వైజర్ ఏడుకొండలు, సీనియర్ అసిస్టెంట్ మణికంఠ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

పైడితల్లి జాతరలో చివరి ఘట్టమైన ఉయ్యాల కంబాల మహోత్సవాన్ని పురస్కరించుకుని వేకువజాము నుంచి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, విశేష కుంకుమార్చనలు జరిపారు. ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణ, బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, నేతేటి ప్రశాంత్‌ల నేతృత్వంలో ప్రత్యేక పూజలు సాగాయి. ధనత్రయోదశిని పురస్కరించుకుని మహాలక్ష్మి అష్టోత్తరనామాలతో కుంకుమార్చనలు చేశారు. అమ్మవారి ఘటాలకు విశేష పూజలు జరిపారు. ఉయ్యాల కంబాల ఉత్సవం అనంతరం సిరిమానుతో పాటు తెచ్చిన రాటకు మూడుసార్లు గొడ్డలి ఆనించి ఉయ్యాలను తీసివేశారు. దీంతో అమ్మవారి జాతరకు ముగింపు పలికినట్లేనని, బుధవారం వనంగుడి వద్ద చండీహోమం పూర్ణాహుతితో జాతర ముగుస్తుందని అర్చకులు తెలిపారు. ఉత్సవం పూర్తయిన తర్వాత అమ్మవారిని మేళతాళాలతో వనంగుడికి తీసుకువెళ్తారు. బుధవారం నుంచి అమ్మవారు వనంగుడిలో ఆరు నెలల పాటు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

వనంగుడిలో విశేష పూజలు

రైల్వేస్టేషన్ వద్ద ఉన్న పైడితల్లి అమ్మవారి వనంగుడిలో వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు జరిగాయి. వేదపండితులు వెలువలపల్లి నరసింహమూర్తి, సాయికిరణ్‌లు శాస్త్రోక్తంగా పూజాదికాలు చేశారు. అనంతరం అర్చకులు నేతేటి ప్రశాంత్ ఆధ్వర్యంలో అమ్మవారికి, బాలాయలంలో చిన్నారి పైడితల్లికి, ఆలయ ఆవరణలో పుష్పాలతో ప్రత్యేక అలంకరణలు జరిగాయి.

నేడు దీక్షధారుల యాత్ర

అమ్మవారి దీక్షధారులు మంగళవారం రాత్రి, బుధవారం వేకువజామున ఇరుమడులు కట్టుకుని ఉదయం 6 గంటలకు చదురుగుడికి అమ్మవారి నామస్మరణ చేస్తూ అమ్మవారి ఉత్సవవిగ్రహంతో వనంగుడికి బయలుదేరుతారు. వనంగుడి వద్ద నిర్వహించే చండీహోమం, పూర్ణాహుతి కార్యక్రమాల్లో పాల్గొంటారు. పూర్ణాహుతి పూర్తయిన తర్వాత దీక్ష విరమణలు చేస్తారు. దీంతో నెలరోజుల పాటు సాగిన జాతర ముగుస్తుంది.